సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 27 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.25,500

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,500, కనిష్టంగా రూ.2,600 ప్రకారం ధర పలికాయి.



స్థిరంగా టమాట ధర

టమాట ధర స్థిరంగా కొనసాగుతోంది. కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : ఎస్పీ రత్న



పుట్టపర్తి టౌన్: జిల్లాలో గురువారం మూడు ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఎన్నికల సందర్భంగా గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రొద్దం, గాండ్లపెంట, రామగిరి ఎంపీపీ స్థానాల ఎన్నికల కోసం ఇప్పటికే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో 30 యాక్ట్‌తో పాటు 144 సెక్షన్ కూడా అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల పర్యవేక్షణకు సీసీ, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆమె కోరారు. బుధవారం ఆమె రామగిరిలో పర్యటించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.

'నారాయణ' ఘటనపై త్రిసభ్య కమిటీ విచారణ

గోరంట్ల: స్థానిక నారాయణ పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీపతి లైంగిక వేధింపుల ఘటనపై విచారణకు విద్యాశాఖ త్రిసభ్య కమిటీని నియమించింది. మండల విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్ప, డివిజినల్ విద్యాధికారి పద్మప్రియ, బాలికల పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు మాధవీలత సభ్యులుగా గల కమిటీ బుధవారం నారాయణ పాఠశాలను సందర్శించింది. కరస్పాండెంట్ లక్ష్మీపతి వ్యవహారశైలి, అతని ప్రవర్తనపై విద్యార్థులు, సిబ్బందితో విచారణ చేపట్టింది. అదే విధంగా బాధిత విద్యార్థి స్వగ్రామానికి సైతం వెళ్లిన కమిటీ సభ్యులు బాలిక స్టేట్ మెంట్‌ను రికార్డు చేశారు. విచారణ నివేదికను విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని మండల విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్ప తెలిపారు. కాగా, గిరిజన విద్యార్థిపై నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ లైంగిక వేధింపుల ఘటనపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే.

రామగిరిలో రౌడీరాజ్యం

- రెచ్చిపోయిన పరిటాల అనుచరులు
- వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీడీఓపై దాడి
- వాహనాల అద్దాలు ధ్వంసం
- ఎంపీపీ ఎన్నికను కల్లోలం చేయాలని కుట్రలు
- 'పరిటాల' రాజ్యాంగం అమలు చేస్తున్న సునీత



వైఎస్సార్‌సీపీ నాయకుల వాహనంలో టీడీపీ గూండాలు పెట్టిన కొడవలి



టీడీపీ నాయకుల దాడిలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ నేతల వాహనం



సోమందేపల్లిలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి : మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అనుచరులు రెచ్చిపోయారు. 'రామగిరి అంటే రౌడీ రాజ్యం.. పరిటాల రాజ్యాంగం అమల్లో ఉంటుంది' అన్న రీతిలో కల్లోలం సృష్టించారు. నేడు (మార్చి 27) జరగబోయే రామగిరి ఎంపీపీ ఎన్నికకు సంబంధించి అనెక్సర్ 1, 2 ఇచ్చేందుకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీకి చెందిన న్యాయవాది కురుబ నాగిరెడ్డి, రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డిపై టీడీపీ అల్లరిమూకలు దాడికి దిగాయి. రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకోగానే.. పక్కా ప్రణాళికతో కొందరు గుంపుగా వచ్చి భౌతికదాడికి దిగారు. ఎంపీడీఓ కార్యాలయంలోకి తోసుకెళ్లి బంధించారు. లోపల ఎంపీడీఓను సైతం చితకబాదినట్లు సమాచారం. అనెక్సర్ 1, 2 పత్రాలను చించేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతల వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. వాహనాల్లోకి మారణాయుధాలు విసిరి.. అక్రమ కేసులు బనాయించాలనే యత్నం చేశారు. అనంతరం పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ దాడి చేసిన వారిని వదిలేసి..అనుమతి లేనిదే ఎందుకొచ్చారంటూ బాధితులపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీ రత్న రామగిరికి చేరుకుని..విచారణ చేపట్టారు.

మెజార్టీ లేకపోయినా..

రామగిరి మండలంలో మొత్తం పది ఎంపీటీసీ స్థానాలు ఉండగా... నసనకోట మినహా తొమ్మిదింట (పేరూరు-1, పేరూరు-2, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి, రామగిరి, పోలేపల్లి, గంతిమర్రి, మాదాపురం, కుంటిమద్ది) వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత పంచాయతీ నసనకోటలో మాత్రం టీడీపీ అభ్యర్థి గెలిచాడు. రామగిరి ఎంపీపీ పదవి జనరల్ మహిళకు రిజర్వు కావడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన మీనుగ నాగమ్మ ఆ పదవిలో కొనసాగారు. అయితే..ఆమె ఈ ఏడాది జనవరిలో అకాల మరణంతో ప్రస్తుతం ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. మండలంలో ఐదుగురు మహిళా ఎంపీటీసీ సభ్యులుండగా.. అందరూ వైఎస్సార్‌సీపీ వారే. అయినప్పటికీ ఎంపీపీ పదవిని టీడీపీ పరం చేయాలని పరిటాల సునీత తాపత్రయ పడుతున్నట్లు స్పష్టమవుతోంది.

అక్రమ కేసులు.. అరెస్టులకు ప్లాన్

అధికారాన్ని అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి.. అరెస్టు చేయించాలని టీడీపీ నేతలు ప్లాన్ వేసినట్లు బుధవారం రామగిరి ఘటనా దృశ్యాలను బట్టి స్పష్టమవుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలను ఎంపీడీఓ కార్యాలయంలో బంధించి.. బయట ఉన్న వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు వాటిలోకి మారణాయుధాలు చేర్చడం అనుమానాలకు తావిస్తోంది.

'తోపుదుర్తి'ని అడ్డగించిన పోలీసులు..

వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి సమాచారం అందుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రామగిరి బయలుదేరారు. అయితే..మార్గ మధ్యంలో సోమందేపల్లి క్రాస్ వద్ద పెనుకొండ డీఎస్పీ వై.వెంకటేశ్వర్లు అడ్డుకుని సోమందేపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మూడు గంటల సేపు స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. విషయం తెలుసుకున్న ఉషశ్రీచరణ్ అక్కడికి చేరుకుని.. పోలీసులతో వాగ్వాదం చేశారు.

ఎంపీపీ పదవి ఆశించడం హాస్యాస్పదం

- తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

రామగిరి మండలంలో మొత్తం పది ఎంపీటీసీ స్థానాలకు గానూ ప్రజలు కేవలం ఒక్క సీటు మాత్రమే టీడీపీకి ఇచ్చారు. అయినా ఎంపీపీ పదవి ఆశించడం హాస్యాస్పదం. ప్రజాక్షేత్రంలో గెలవడం చేతకాక.. దొడ్డిదారిలో పదవులు కావాలనే ఆశ ఎందుకు? మెజారిటీ సీట్లు లేనప్పుడు ఎన్నికలకు రావడమే అనవసరం. ప్రత్యర్థి పార్టీ నేతలను బెదిరింపులకు గురిచేయడం రాజకీయం కాదు. ఎస్పీ నిష్పక్షపాతంగా పని చేస్తారనే నమ్మకం ఉన్నప్పటికీ రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ మాత్రం పూర్తిగా పరిటాల సునీత కనుసన్నల్లోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. రామగిరి వెళ్లాల్సిన ప్రతిసారీ పోలీసుల అనుమతి తీసుకోవాలని ఏ రాజ్యాంగంలోనూ లేదు. రామగిరి మండలం పాకిస్తాన్‌లో లేదు కదా?! ప్రశాంతంగా ఉండే ప్రాంతాలను దోపిడీ, రౌడీరాజ్యంగా మార్చడమే పరిటాల కుటుంబం పని. ఎంపీటీసీ సభ్యుల పిటిషన్ మేరకు ఎన్నిక పూర్తయ్యే వరకు రక్షణ కల్పించాలని హైకోర్టు నుంచి కూడా ఉత్తర్వులు వచ్చాయి. ఎంపీపీ ఎన్నికతో పరిటాల సునీతకు ఏం అవసరం ఉంది? మహిళా అభ్యర్థులు టీడీపీలో లేరు. ఎన్నికల హాలులో కూర్చుని వెళ్లకుండా.. కొట్లాట, గలాట ఎందుకు? గతంలో సునీత మంత్రిగా ఉన్న సమయంలోనూ కనగానపల్లి ఎంపీపీ ఎన్నిక విషయంలో ఇద్దరు మహిళా సభ్యులపై చేయి చేసుకున్న ఘటన అందరికీ గుర్తుంది. ఎంపీపీ పదవి కోసం వీధికెక్కుతోన్న పరిటాల సునీతను చంద్రబాబు నియంత్రించాలి.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ఉషశ్రీ చరణ్
- పీఠాలు దక్కించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపాటు

ప్రశాంతి నిలయం/సోమందేపల్లి: గాండ్లపెంట, రామగిరి, రొద్దం ఎంపీపీ స్థానాలకు గురువారం నిర్వహించనున్న ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో పారదర్శకంగా జరిగేలా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె పార్టీ శ్రేణులలో కలసి కలెక్టరేట్‌కు విచ్చేసి జేసీని ఆయన చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె పుట్టపర్తిలో, సోమందేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ ఎన్నికలు జరగనున్న మూడుచోట్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, కూటమి పార్టీలకు ఒక్క చోట కూడా అవకాశం లేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగితే ఆ స్థానాలన్నీ వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. దీంతో దొడ్డిదాడిలో ఎంపీపీ పీఠాలు దక్కించుకోవాలన్న లక్ష్యంతో టీడీపీ నేతలు జిల్లాలో మళ్లీ ఫ్యాక్షన్‌కు ఊపిరి పోస్తున్నారని మండిపడ్డారు. రామగిరి మండలంలో టీడీపీ నాయకులు అల్లర్లు సృష్టించి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పరిస్థితిని సమీక్షించడానికి వెళ్తున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని పోలీసులు అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి దౌర్జన్యాలను ప్రోత్సహిస్తే న్యాయ స్థానం ముందు నిలవాల్సి వస్తుందని హెచ్చరించారు. కూటమి పార్టీల నాయకులు, ఎమ్మెల్యేల కుట్రలను చట్టపరిధిలో ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు పార్టీ బలపరచిన అభ్యర్థికి మద్దతు తెలిపి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని ఆమె కోరారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

బలం లేకున్నా.. బరితెగింపు

- ఎంపీపీ స్థానాల కోసం కూటమి సర్కారు కుట్ర
- మెజారిటీ లేకున్నా ఫిరాయింపులకు ప్రోత్సాహం
- ఒక్క సీటు ఉన్న చోటా పీఠం కోసం తీవ్ర యత్నం
- రిజర్వేషన్ కేటగిరీ సభ్యులు లేకున్నా తాపత్రయం
- నేడు రామగిరి, గాండ్లపెంట, రొద్దం ఎంపీపీ ఎన్నికలు

సాక్షి, పుట్టపర్తి

ప్రజా క్షేత్రంలో ఓడిపోయినా.. అధికార బలంతో పదవులు దక్కించుకోవాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలో ముందుగానే దౌర్జన్యాలకు దిగుతూ.. బెదిరింపు రాజకీయాలకు తెరలేపారు. జిల్లాలో రామగిరి, గాండ్లపెంట, రొద్దం మండలాల పరిషత్ అధ్యక్షులకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఏ మండలంలోనూ టీడీపీకి మెజారిటీ లేదు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ మూడు మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున టీడీపీ మూడు స్థానాలను మాత్రమే దక్కించుకుంది. అయితే వివిధ కారణాలతో ఎంపీపీ స్థానాలకు ఎన్నిక జరగనుండటంతో పీఠం కోసం కూటమి పార్టీల నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. తాము చెప్పిన అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే చాలామంది ఎంపీటీసీ సభ్యులకు బెదిరింపులు వెళ్లినట్లు తెలిసింది. రాప్తాడులో మాజీ మంత్రి పరిటాల సునీత అనుచరులు, కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ వర్గీయులు, పెనుకొండలో మంత్రి సవిత వర్గం.. ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ సభ్యులపై పెత్తనం చెలాయించాలని చూస్తున్నారు. అయితే ఏ ఒక్క మండలంలో కూడా టీడీపీ గెలిచేందుకు సరిపడా సంఖ్యాబలం లేదు. దీంతో ఎంపీపీ ఎన్నికను వాయిదా వేయించి మరో ఆరు నెలల పాటు ఎంపీపీ పదవి ఎవరికీ లేకుండా చేయాలని కూటమి పార్టీల నేతలు కుట్రలు చేస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఎంపీపీ ఎన్నికకు హాజరు కావొద్దని ఎంపీటీసీ సభ్యులకు వార్నింగ్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులంతా పార్టీ క్రమశిక్షణకు లోబడి ఎన్నికల్లో పాల్గొనేందుకు సంసిద్ధమయ్యారు.



మండలానికి ఒక సీటు కూడా లేదాయె..

రామగిరిలో 10 ఎంపీటీసీ స్థానాలుండగా.. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కేవలం ఒక్క సీటు మాత్రమే దక్కించుకుంది. మిగతా 9 చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయ ఢంకా మోగించి ఎంపీపీ పీఠం కైవసం చేసుకుంది. అయితే రామగిరి ఎంపీపీగా ఉన్న మీనుగ నాగమ్మ ఇటీవల మృతి చెందడంతో ఎన్నిక అనివార్యమైంది. ఇక రొద్దం మండలంలో 15 స్థానాలకు గానూ టీడీపీ ఖాతా కూడా తెరవలేదు. అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయఢంకా మోగించారు. రొద్దం ఎంపీపీగా ఉన్న చంద్రశేఖర్ అకాల మరణంతో అక్కడ ఎన్నిక జరగనుంది. గాండ్లపెంట మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. టీడీపీ ఒక్క చోట మాత్రమే గెలిచింది. ఎంపీపీగా ఉన్న జగన్ మోహన్ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ సంఖ్యాబలం ఐదుగా ఉంది.

రామగిరిలో ఒక్క సీటుతో రాజకీయం..

రామగిరిలో పది సీట్లకు గానూ టీడీపీ ఒక్కచోటే గెలిచింది. రామగిరి ఎంపీపీ జనరల్ మహిళకు రిజర్వు చేశారు. టీడీపీ తరఫున మహిళలు గెలవలేదు. అయినా.. ఎంపీపీ పదవి చేజిక్కించుకోవాలని దాడులకు తెగబడుతున్నారు.

రొద్దంలో వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం!

మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గంలోని రొద్దం ఎంపీపీ స్థానం ఎస్సీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని 15 స్థానాలనూ వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ చేసింది. ఇటీవల ఓ సభ్యుడు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించాడు. ఆయన కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. దీంతో ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

గాండ్లపెంటలో ఫిరాయింపు కుట్రలు..

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ నేతృత్వంలో గాండ్లపెంట ఎంపీపీ పదవి చేజిక్కించునేందుకు ఫిరాయింపు కుట్రలు చేస్తున్నారు. ఈ స్థానం జనరల్ కేటగిరీకి రిజర్వు కాగా, గత ఎన్నికల్లో టీడీపీ తరఫున ఒకరు మాత్రమే గెలిచారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నుంచి ఒకరు ఫిరాయించారు. దీంతో మిగతా ఐదుగురి మద్దతుతో మరోసారి మండల పరిషత్ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ గెలుచుకోవడం ఖాయమని స్థానికులు చెబుతున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ నేతలు హాజరు కాకుండా కట్టడి చేసి ఎన్నికను అడ్డుకునేందుకు ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ అనుచరులు బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది.

వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా 'విశ్వ'



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యునిగా ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. అలాగే, అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఎం.లక్ష్మీనారాయణను పార్టీ జిల్లా ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షునిగా నియమించారు.

రూ.వెయ్యి కంతు కట్టనందుకు.. ఇంటికి తాళం

- ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ దౌర్జన్యం

పెనుకొండ రూరల్: ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దౌర్జన్యాలు నానాటికీ మితిమీరిపోతున్నాయి. చిన్నపాటి కంతు చెల్లించడంలో జాప్యం చోటు చేసుకోవడంతో ఓ మహిళ ఇంటికి తాళం వేసిన ఘటన పెనుకొండ మండలంలో చోటు చేసుకొంది. వివరాలు.. మండలంలోని కొండంపల్లి గ్రామానికి చెందిన నాగమ్మ... ఫ్యూజిన్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.40 వేల రుణం తీసుకుంది. నిబంధనల మేరకు ప్రతి రెండు వారాలకు ఒకసారి కంతు చెల్లిస్తూ వచ్చారు. ఈ వారం కంతు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉండగా డబ్బు సమకూరక ఇబ్బంది పడుతున్న నాగమ్మ తన కుమారుడు వడ్డె అంజితో కలసి ఒక రోజు గడువు ఇవ్వాలని ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులను కోరారు. దీనిపై కంపెనీ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడుతూ ఇంటి నుంచి బలవంతంగా నాగమ్మను బయటకు పంపి తాళం వేశారు. దీంతో చేసేదేమీ లేక ఇంటి ముందే బాధితులు ఉండిపోయారు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై కంపెనీ బ్రాంచ్ మేనేజర్ మంజులను ఫోన్‌లో వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.



తాళం వేసిన ఇంటి ఎదుటే నిద్రిస్తున్న నాగమ్మ

క్లుప్తంగా

నెట్టికంటుడి హుండీ ఆదాయం లెక్కింపు



నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా సమకూరిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం 103 రోజులకు గానూ రూ.66,85,838 లక్షల నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.63,447 నగదు, 37 అమెరికన్ డాలర్లు, నాలుగు గ్రాముల బంగారు, 1.900 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈఓ కె.వాణి తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరభద్రసేవా సమితి, హనుమాన్ సేవా సమితి, రాఘవేంద్ర సేవా సమితి, శ్రీరామ సేవాసమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి మూల్యాంకనం కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. ఈ మేరకు డీఈఓ కిష్టప్పను బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. 58 సంవత్సరాలు పైబడిన వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కేంద్రాల్లో ఫ్యాన్లు, లైటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు సుదూర ప్రాంతాల నుంచి ఉపాధ్యాయుల సౌకర్యార్థం సాయంత్రం 4గంటలకు ఈ ప్రక్రియను ముగించాలని కోరారు.

వ్యక్తిపై బీరు బాటిళ్లతో దాడి

ధర్మవరం రూరల్: స్థానిక దుర్గా బార్ అండ్ రెస్టారెంట్‌లో బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. ధర్మవరం మండలం రావులచెరువు గ్రామానికి చెందిన బోగం మహేంద్రపై ధర్మపురి గ్రామానికి చెందిన విష్ణు, మారుతి బీరు సీసాలతో దాడి చేశారు. వీపు, చేతిపై గాజు పెంకులతో బలంగా పొడిచారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

చేదు మిగిల్చిన తీపి పంట..

తీపి పంచాల్సిన కర్బూజ ఈ సారి రైతన్నలకు చేదు రుచి చూపిస్తోంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా కాయ నిట్టనిలువునా చీలి పోతోంది. ఫలితంగా పెట్టుబడులు సైతం చేతికి అందక రైతులు కుదేలవుతున్నారు.

- నష్టాలతో కుదేలైన కర్బూజ రైతు
- దెబ్బతీసిన వాతావరణ మార్పులు
- కాయ నిలువునా చీలి.. కుళ్లిపోతున్న వైనం
- పెట్టుబడులు సైతం తిరిగిరాని పరిస్థితి



దంట్లపల్లిలో సాగు చేసిన కర్బూజ పంట



చీలిపోయిన కర్బూజ కాయ

పుట్టపర్తి రూరల్: సంప్రదాయ పంటల సాగుతో నష్టపోయిన పలువురు రైతులు ఈ సారి మార్పు కోసం కర్బూజ సాగు చేపట్టారు. సరికొత్త ఆశలతో సాగు చేసిన తీగజాతి పంట ఊహించని విధంగా వాతావరణంలో మార్పుల కారణంగా రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. పంట ఏపుగా పెరిగింది... ఆశించిన మేర దిగుబడి ఉంది... అయినా కాయ నిట్టనిలువునా చీలి పోవడంతో కనీస పెట్టుబడులు సైతం చేతికి అందని పరిస్థితి నెలకొంది.

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి..

కర్బూజ సాగుకు పెట్టుబడి ఎక్కువే అయినా రైతులు వెనుకంజ వేయలేదు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 300 హెక్టార్లలో కర్బూజ సాగులోకి వచ్చింది. సేంద్రియ ఎరువులతో పంట సాగు చేపట్టారు. సేద్యం, సాలు తీత, మల్చింగ్ షీట్, ఎకరాకు 300 గ్రాముల చొప్పున విత్తనాలు, 15వ రోజు నుంచి లీఫ్ మైనర్, దోమ, ఊజీ ఈగ, లద్దె పురుగు, పచ్చపురుగు వంటి కీటకాలతో పాటు వేరుకుళ్లు, బూడిద, ఆకుముడత తెగులు, సస్యరక్షణకు మందుల పిచికారీకి మొత్తం కలిపి ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడులయ్యాయి. మూడు నెలల్లో పంట కాపునకు వచ్చి దాదాపు 10 టన్నుల దిగుబడినిస్తుంది. కాయ నాణ్యత బాగుంటే ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు కచ్చితమైన లాభం ఉంటుందని రైతులు ఆశపడ్డారు.

ఫ్రూట్ సెట్టింగ్‌లో లోపం..

పసి పిల్లల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో... అన్నే జాగ్రత్తలను కర్బూజ పంట సాగులోనూ రైతులు తీసుకుంటుంటారు. అయితే వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకు పంట తట్టుకోలేక పోయింది. విత్తనం నాటిన 30 నుంచి 40 రోజులలోపే పూత – పిందె (ఫ్రూట్ సెట్టింగ్) జరగాలి. కానీ అలా జరగకపోవడంతో మందుల పిచికారీ, సూక్ష్మపోషకాలు వంటివి మరింతగా డ్రిప్ ద్వారా అందించాల్సి వచ్చింది. దీంతో 40 నుంచి 55 రోజుల వరకు వివిధ దశల్లో ఫ్రూట్ సెట్టింగ్ జరిగింది. పండిన కాయలు ఉరుములు, మెరుపులు, వర్షాల ధాటికి నిలువునా చీలాయి. దీనికి తోడు వాతావరణంలో ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులను కాయలు తట్టుకోలేకపోయాయి. తీగలపైనే చీలిన కాయలు కుళ్లిపోతున్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను రెండున్నర ఎకరాల్లో కర్బూజ సాగు చేశాను. పెట్టుబడి రూ.2.5 లక్షలు అయింది. పంట ఏపుగానే పెరిగింది కానీ, కాయలో చీలికలు ఏర్పడి కుళ్లిపోతున్నాయి. చేతికొచ్చిన అరకొర కాయలు అమ్మితే పెట్టుబడి సైతం దక్కడం లేదు. ప్రభుత్వం ఆదుకోకుంటే అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిందే. కర్బూజా పంటకు స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే రైతులకు రవాణా ఖర్చులు తగ్గుతాయి.

– కుళ్లాయప్ప, రైతు, ఎనుములపల్లి, పుట్టపర్తి మండలం

మార్కెటింగ్ సౌకర్యం లేక అవస్థలు..

అసలే పచ్చి సరుకు.. రెండు రోజుల వ్యవధిలోనే విక్రయించుకోవాలి. లేదంటే కర్బూజా రైతుల పరిస్థితి అధోగతే అవుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండించే కర్బూజా పంటకు బెంగళూరు, తమిళనాడు, బెంగాల్, మహారాష్ట్రల్లో మంచి గిరాకీ ఉంది. స్థానికంగా మార్కెటింగ్ అవకాశం లేకపోవడంతో 150 నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెంగళూరు మార్కెట్‌కు రైతులు తరలిస్తున్నారు. మూడు టన్నుల కాయలను తరలించేందుకు వాహనానికి రూ.7వేల నుంచి రూ.10వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం కిలో ధర మొదటి రకం రూ.40 పలుకుతోంది. మిగిలిన రెండు, మూడవ రకం ధర రూ.10– రూ.20 మధ్యన ఉంటోంది. ఇక ఏజెంట్‌కు 10 శాతం కమీషన్ పోను రైతులకు మిగిలేది అరకొరనే.

ఊహించని నష్టం



మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని కర్బూజ పెట్టాను. రెండు విడతల్లో మొత్తం పది ఎకరాల్లో సాగు చేశాను. ఐదు ఎకరాల్లో రూ.3లక్షల రాబడి వచ్చింది. మిగిలిన ఐదు ఎకరాల్లో రాబడి చేతికి అందే పరిస్థితి లేదు. వాతావరణ మార్పులతో ఊహించని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. లేకపోతే అప్పుల నుంచి బయటపడటం చాలా కష్టమవుతుంది.

– నంజిరెడ్డి, ఎనుములపల్లి, పుట్టపర్తి మండలం

సస్యరక్షణ చేపట్టాలి



వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల కారణంగా కర్బూజ ఫ్రూట్ సెట్టింగ్‌లో తేడాలు వచ్చాయి. కాసిన కాయ చీలిపోతోంది. సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే వీలైనంత వరకు పంటను కాపాడుకోవచ్చు.

– చంద్రశేఖర్, ఉద్యాన శాఖాధికారి

బావిలో వ్యక్తి మృతదేహం

కదిరి అర్బన్: మండలంలోని బాలప్పగారిపల్లి సమీపంలో ఉన్న బావిలో బుధవారం ఉదయం ఓ గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. దాదాపు 30 నుంచి 40 ఏళ్ల మధ్యలో వయసున్న వ్యక్తిగా అంచనా వేశారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ నిరంజన్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94409 01882కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

కర్ణాటక మద్యం కేసులో ఇద్దరికి జైలు

పెనుకొండ: కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ పెనుకొండ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... 2020, ఫిబ్రవరి 20న పెనుకొండలోని దర్గాపేటకు చెందిన మహబూబ్ బాషా, వహబ్ కర్ణాటక మద్యం తరలిస్తూ అప్పటి ఎస్‌ఐ హరూన్‌బాషాకు పట్టుబడ్డారు. ఈ కేసు వాదనలు అప్పటి నుంచి పెనుకొండలోని జేఎఫ్‌సీఎం న్యాయస్థానంలో కొనసాగుతూ వచ్చాయి. నేరం చేసినట్లుగా అంగీకరించడంతో ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బొజ్జప్ప తీర్పు వెలువరించారు. దీంతో ముద్దాయిలను కోర్టు వద్ద నుంచి నేరుగా సబ్‌జైల్‌కు పోలీసులు తరలించారు.

జూదరుల అరెస్ట్

తలుపుల: మండలంలోని నూతనకాల్వ సమీపంలో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టిన సమయంలో 8 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.7,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సెంట్రల్ వర్సిటీలో సమస్యలు పరిష్కరించండి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థి సంఘాల నాయకుడు యశ్వంత్ డిమాండ్ చేశారు. సమస్యలపై బుధవారం వర్సిటీ వద్ద విద్యార్థులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ వర్సిటీలో నెలకొన్న సమస్యలపై ఫిబ్రవరి 6వ తేదీ నుంచి ఇప్పటి వరకూ నాలుగు దఫాలుగా వినతి పత్రాలు సమర్పించినా ఫలితం దక్కలేదన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఫీజులు తగ్గించాలని అనేక మార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలు ఒకే పరిధిలో ఉంటాయని, అయితే ఇతర ప్రాంతాల్లోని వర్సిటీల్లోని ఫీజులకు అనంతపురంలోని వర్సిటీలోని ఫీజులకు రూ.వేలల్లో వ్యత్యాసం ఉంటోందని తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వడం లేదని, కాంట్రాక్టర్‌ను మార్చాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల హాస్టల్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు వెంకట్రావ్, యశ్వంత్, విలియం, ధనరాజ్, రాము, అమరేష్, అమర్, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు

ప్రశాంతి నిలయం: జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు నూతన జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటీ అధ్యక్షుడు శంకర్‌లాల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హౌసింగ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ప్రత్యేకంగా సమావేశమై నూతన జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నట్లు వివరించారు. కమిటీ అధ్యక్షుడిగా ధర్మవరం డీఈఈ శంకర్‌లాల్, ఉపాధ్యక్షుడిగా జిల్లా గృహనిర్మాణ సంస్థ కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరాజు, జనరల్ సెక్రెటరీగా హిందూపురం రూరల్ ఏఈ నారాయణరెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా పుట్టపర్తి డీఈ కె.వెంకటరమణారెడ్డి, ధర్మవరం అర్బన్ ఏఈ చిరంజీవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాద్రి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా మనోహర్‌రెడ్డి, విశ్వనాథ్, ఈశ్వరయ్య, ట్రెజరర్‌గా హిందూపురం డీఈఈ శ్రీనివాస్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చంద్రశేఖర్, సునీత, శోభారాణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సుమన్‌నాయక్, యోగేశ్వరయ్య, రాజేంద్రప్రసాద్, హరినాయక్, మహేష్, నాగభూషణం, రెడ్డయ్యను ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులు పనిచేస్తారన్నారు.

టీడీపీ నేత అండతో మత్తు మందు విక్రయం

- రాయదుర్గంలోని శ్రీవిజయలక్ష్మి మెడికల్ స్టోర్‌లో అమ్మకాలు
- డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో బయటపడిన టోసెక్స్ సిరప్
- కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు



మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న

రాయదుర్గంటౌన్: మత్తు కలిగించే టోసెక్స్ సిరప్‌ను అనధికారికంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో రాయదుర్గంలోని బళ్లారి రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న శ్రీవిజయలక్ష్మి మెడికల్ స్టోర్‌ను జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. టీడీపీ నాయకుడు చదం పశుపతనాథరెడ్డి అండతో ఆయన సోదరుడు హనుమానరెడ్డి అక్రమ దందా కొనసాగిస్తున్నట్లుగా నిర్ధారణ అయింది. బిల్లులు లేకుండా కొనుగోలు చేసిన దాదాపు వెయ్యికిపైగా టోసెక్స్ సిరప్ బాటిళ్లను బల్క్‌గా అమ్ముతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. అలాగే వైద్యుడి స్కానింగ్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తుండడం, ఫార్మాసిస్ట్ లేకపోవడం లాంటి మరో రెండు కేసులనూ నమోదు చేసి యజమాని హనుమారెడ్డికి నోటీసు జారీ చేశారు. అనంతరం పోలీసులు, సచివాలయ వీఆర్‌ఓల సమక్షంలో పంచనామా చేసి నివేదిక సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెడికల్ షాపును సీజ్ చేయనున్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, రెండు వారాల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గలో కాలేజీ విద్యార్థులకు టోసెక్స్ సిరప్ విక్రయిస్తూ ముగ్గురు వ్యక్తులు అక్కడి పోలీసులకు పట్టుపడ్డారు. విచారణలో తాము రాయదుర్గంలోని విజయలక్ష్మి మెడికల్ స్టోర్‌లో కొనుగోలు చేసినట్లుగా నిందితులు అంగీకరించారు. దీంతో అప్పట్లో హనుమారెడ్డిని చిత్రదుర్గ పోలీసులు అరెస్ట్ చేయగా ఇటీవల బెయిల్‌పై విడుదలై వచ్చాడు. కర్ణాటక పోలీసులు ఇచ్చిన సమాచారంతోనే విజయలక్ష్మి మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేసినట్లుగా సమాచారం.

చమురు కొలతల్లో తేడాలుంటే చర్యలు

- నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించాలి
- పెట్రోల్ బంకును తనిఖీ చేసిన ఆర్డీఓ, డీఎస్‌ఓ



పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ మహేష్, డీఎస్‌ఓ వంశీ కృష్ణారెడ్డిలు

ధర్మవరం అర్బన్: చమురు కొలతల్లో తేడాలుంటే చర్యలు తప్పవని ఆర్డీఓ మహేష్, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి హెచ్చరించారు. వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించాలన్నారు. బుధవారం వారు పట్టణంలోని దుర్గమ్మ ఆలయం వెనుక వైపు ఉన్న భారత్ పెట్రోల్ బంకును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ బంకులోని రికార్డులు పరిశీలించారు. రోజువారీ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయలేదని గుర్తించారు. స్టాకు విక్రయానికి, మిగిలిన స్టాకు సరిగ్గా రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. పెట్రోలు బంకులో తాగునీరు సదుపాయం, గాలిపంపు లేకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో పెట్రోల్ బంకు నిర్వాహకులను మందలించారు. అగ్నిమాపక పరికరాలన్నీ మూలన పెట్టడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటర్ రీడింగ్, ట్యాంకు రీడింగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. పెట్రోల్, డీజిల్ కల్తీ ఉందా లేదా అని ఫిల్టర్ పేపర్ ద్వారా పరిశీలించారు. మరోసారి తనిఖీకి వచ్చే సమయానికి రికార్డులన్నీ కరెక్ట్‌గా ఉండాలని ఆదేశించారు. తనిఖీల్లో సీఎస్‌డీటీ సురేంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం



ఎన్‌పీకుంట పీహెచ్‌సీలో రోగిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

ఎన్‌పీకుంట/గాండ్లపెంట: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని, ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) ఫైరోజాబేగం సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నిర్దిష్ట సమయంలో తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయాలన్నారు. బుధవారం ఆమె ఎన్‌పీకుంట, గాండ్లపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీల్లోని రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. పీహెచ్‌సీల్లోని ల్యాబ్ గదులను, కాన్పుల గదులను తనిఖీ చేశారు. ఎన్‌పీకుంటలో వ్యాక్సిన్ వేసే సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదు వస్తున్నాయని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎంహెచ్‌ఓ వెంట అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మేనాయక్, వైద్యాధికారులు డాక్టర్ ఆనంద్‌వర్ధన్, మహేశ్వరమారుతి, సీహెచ్‌ఓ నాగలక్ష్మి ఉన్నారు. అంతకుముందు ఎన్‌పీకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేస్తున్న సమయంలో తలకు తీవ్ర గాయమై చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన వ్యక్తికి డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం స్వయంగా చికిత్స చేశారు.

పేదల భూమిపై కూటమి నేతల కన్ను

- రాత్రికి రాత్రే అసైన్డ్ భూమిలో మామిడి మొక్కలు నాటిన వైనం
- ఇరువర్గాలను బైండోవర్ చేసిన పోలీసులు
- సాగులో లేనందున పట్టాలు రద్దు చేస్తానంటూ తహసీల్దార్ బెదిరింపు



తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న బాధిత రైతులు

బత్తలపల్లి: ప్రభుత్వ భూ పంపిణీలో భాగంగా నిరుపేదలకు అందజేసిన అసైన్డు భూమిని కూటమి నేతలు తమ అనుచరులకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. సదరు భూమిలో రాత్రికి రాత్రే మామిడి మొక్కలు నాటారు. వివరాలు... బత్తలపల్లి మండలం దంపెట్ల రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్107 లో 26.80 ఎకరాల భూమిని 2012లో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చొరవతో సూర్యచంద్రాపురం గ్రామానికి చెందిన 11 మంది ఎస్టీలకు రెండు ఎకరాల చొప్పున 22 ఎకరాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మిగిలిన 4.80 ఎకరాల భూమితో పాటు 11 మంది రైతులకు పంపిణీ చేసిన భూమిని ఆక్రమించుకునేందుకు కూటమి పార్టీల నేతలు కుట్రకు తెరదీశారు. గత 15 రోజులుగా ఆ భూమిని కబ్జా చేసేందుకు ముళ్లచెట్లు తొలగించడం, భూమిని చదును చేయడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను రాత్రికి రాత్రే చేపట్టారు. తమకు పంపిణీ చేసిన భూమిలో సాగు ఎలా చేస్తారంటూ హక్కుదారులు కూటమి నేతలను అడ్డుకుని, న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు. ఇరువర్గాల వారు భూమి తమదంటే తమదంటూ వాగ్వాదానికి దిగడంతో అందరినీ పిలుచుకెళ్లి తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేయించారు. ఈ భూ సమస్య పరిష్కారం అయ్యే వరకూ ఎవరూ అందులోకి వెళ్లకూడదని, సాగు చేయరాదని, ఘర్షణలకు పాల్పడరాదంటూ ఎస్‌ఐ సోమశేఖర్ సూచించారు. కాగా, తమకు గతంలోనే ప్రభుత్వం భూ పంపిణీ చేస్తూ హక్కు పట్టాలు ఇచ్చిందని తహసీల్దార్ స్వర్ణలత దృష్టికి లబ్ధిదారులు తీసుకెళ్లగా.. ఆ భూములు సాగులో లేనందున పట్టాలను రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ బెదిరింపు ధోరణిలో మాట్లాడడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావం, కరువు పరిస్థితుల కారణంగా తాము భూమిని సాగు చేయలేకపోయామని, అంతమాత్రాన సాగు హక్కులు పొందిన భూమి తమకు కాకుండా పోతుందా? అంటూ బాధిత రైతులు వాపోతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పట్టాలను రద్దు చేయించి తమకు అనుకూలమైన వారికి పట్టాలు ఇప్పించేందుకు కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలసి న్యాయం కోరనున్నట్లు తెలిపారు. కాగా, దంపెట్ల రెవెన్యూ పొలం సర్వే నంబర్ 107లోని వివాదాస్పద భూమిలోకి ఎవరూ వెళ్లరాదని బత్తలపల్లి పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు తహసీల్దారు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

సహకార బ్యాంకులను అభివృద్ధి బాట పట్టించాలి

- మహాజనసభలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

అనంతపురం అగ్రికల్చర్: సహకార బ్యాంకులు, సహకార సొసైటీలను అభివృద్ధిబాట పట్టించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో జరిగిన 128వ మహాజనసభకు పర్సన్ ఇన్‌చార్జి హోదాలో ఆయన హాజరయ్యారు. డిపాజిట్ల సేకరణ, మొండిబకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. వాయిదామీరిన రుణాలకు లీగల్ కవరేజీ ఇవ్వాలని ఆదేశించారు. పర్సన్ ఇన్‌చార్జిలు తరచూ సంఘాలను సందర్శించి ఆర్థిక పరిపుష్టి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న 2025–26 ఆర్థిక సంవత్సరంలో సొసైటీలు, సహకార బ్యాంకుల్లో అన్ని రకాల సేవలు, కార్యకలాపాలు వందశాతం కంప్యూటరీకరణతో జరగాలన్నారు. అందిస్తున్న ఆధునిక సేవలు, రుణాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించి రైతులు, ఇతరత్రా ఖాతాదారులను పెంచుకోవాలన్నారు. ఉద్యోగులందరూ యూనియన్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. 2025–26కు సంబంధించి రూ.167.50 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్‌ను ఆమోదించారు. మహాజన సభలో సీఈఓ కే.సురేఖారాణి, రెండు జిల్లాల డీసీఓలు అరుణకుమారి, కృష్ణానాయక్, నాబార్డు డీడీఎం అనురాధ, సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.